ఈనాడు
సంగారెడ్డి
బుధవారం సెప్టెంబరు 25, 2024

నాలుగేళ్లుగా ఎదురుచూపులే

ఎస్సీ యువతకు అందని రాయితీ రుణం

సంగారెడ్డి టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగావకాశాలు గగనంగా మారాయి. స్వయం ఉపాధిలో రాణించడం తప్పనిసరిగా మారింది. దీనికిగాను యువత సిద్ధంగా ఉన్నా.. పేదరికం కారణంగా పెట్టుబడులు ఇబ్బందిగా మారాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం ఎస్సీ యువతకు రాయితీ రుణ పథకాలు అమలు చేసింది. నాలుగేళ్ల కిందట ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో వారికి ఎదురుచూపులే మిగిలాయి.

బకాయిలు రూ.15 కోట్లపైమాటే

ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో 2020-21 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సైతం పూర్తి చేశారు.

ఎస్సీ రిజర్వుడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మినీ డెయిరీ యూనిట్లు 587 మంజూరయ్యాయి. ఇందులో 121 యూనిట్లకు మాత్రమే రాయితీ నిధులు విడుదలయ్యాయి. మిగతా వారికి విడుదల కాకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. యువతకు స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్‌కు రూ.10.24 కోట్లు రావాల్సి ఉంది.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..: కొత్త ప్రభుత్వమైనా రుణాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా మంజూరు చేసి ఆర్థిక ఉన్నతికి బాటలు వేయాలంటున్నారు. యూనిట్ల గ్రౌండింగ్ ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందని వారు అంటున్నారు. ఈ విషయమై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే యూనిట్ల గ్రౌండింగ్ చేస్తామన్నారు.

ఎల్‌ఈడీ బల్బుల తయారీ నేర్చుకోవడం అభినందనీయం


ఎల్‌ఈడీ బల్బులను పరిశీలిస్తున్న ఎన్‌జీసీ రాష్ట్ర సమన్వయకర్త రాజశేఖర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: తక్కువ ఖర్చుతో ఎల్‌ఈడీ బల్బుల తయారీ నేర్పించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రంలో జాతీయ హరితదళం ఆధ్వర్యంలో మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఎన్‌జీసీ రాష్ట్ర సమన్వయకర్త రాజశేఖర్ మాట్లాడుతూ.. ఎల్‌ఈడీ లైట్లు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. మాధవరెడ్డి, సిద్ధారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పాఠశాల క్రీడా సమాఖ్య(ఇంటర్మీడియట్) ఆధ్వర్యంలో ఈనెల 29న హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపతి మంగళవారం పేర్కొన్నారు. చెస్, క్యారమ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ అండర్-19 ఎంపికలు ఉంటాయని తెలిపారు. పదో తరగతి మెమో, ఇంటర్ బోనాఫైడ్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని చెప్పారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

తత్కాల్ ద్వారా సార్వత్రిక పరీక్ష రుసుం చెల్లించండి

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్టోబర్ 3నుంచి పరీక్ష రాసేందుకు తత్కాల్ ద్వారా ఈనెల 25, 26 తేదీల్లో రుసుం చెల్లించే అవకాశం కల్పించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పదో తరగతికి ఒక్కో పాఠ్యాంశానికి రూ.100(థియరి, ప్రాక్టికల్)తోపాటు అదనంగా రూ.500 చెల్లించాలన్నారు. ఇంటర్‌కు ఒక్కో పాఠ్యాంశానికి రూ.150(థియరి, ప్రాక్టికల్)తోపాటు అదనంగా రూ.వెయ్యి చెల్లించాలన్నారు. పరీక్ష రుసుం మీసేవ, అంతర్జాలం కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పటాన్‌చెరు: నిషేధిత భూమిలో ఇంటి నంబర్లు ఇవ్వడంతోపాటు నిర్మాణాలకు అనుమతించారని పాశమైలారం గ్రామ కార్యదర్శి లక్ష్మణాచారిని సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కోహీర్ గ్రామంలో పనిచేస్తున్న సమయంలో నిషేధించిన వక్ఫ్ భూమిలో 212 ఇంటి నంబర్లు జారీ చేశారు. దీనిపై అక్బర్ అనే వ్యక్తి జూలై 23న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఆగస్టు 12న షోకాజ్ నోటీసు ఇచ్చారు. కార్యదర్శి సమాధానానికి సంతృప్తి చెందని కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నారు.

సౌకర్యాలు కరవు.. సమస్యలకు నెలవు

తహసీల్దారు కార్యాలయాల వద్ద తప్పని నిరీక్షణ

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ప్రభుత్వానికి అత్యధికంగా ఆదాయం సమకూరుస్తున్న తహసీల్దార్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనీస సదుపాయాలు కరవయ్యాయి. చాలాచోట్ల తాగునీటి వసతి కల్పించలేదు. పైసలిస్తేనే పనులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో ఇష్టానుసారంగా..

సంగారెడ్డి అర్బన్: తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. కార్యాలయంలో శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం లేదు. భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రోజుకు 3-4 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని ఉపతహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. సిబ్బంది కొరతా వేధిస్తోందని అంటున్నారు.

ఖేడ్‌లో తప్పని ఇబ్బందులు


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

నారాయణఖేడ్: తహసీల్దారు కార్యాలయంలో సౌకర్యాలు కొరవడటంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించి తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. రోజుకు 10 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించలేదు.

ఆన్‌లైన్ సేవల్లో తాత్సారం

పుల్కల్: తహసీల్దార్ కార్యాలయంలో సాంకేతిక సమస్యలు వేధిస్తున్నాయి. మంచినీటి సౌకర్యం లేదు. శౌచాలయాలున్నా నిరుపయోగంగా మారాయి. చౌటకూర్‌లో పంచాయతీ భవనంలో రిజిస్ట్రేషన్ సేవలు అమలు చేస్తున్నారు. కార్యాలయం చిన్నగా ఉండడంతో చెట్ల కింద నిరీక్షణ తప్పడం లేదు. రోజుకు 8-10 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

రాత పూర్వకంగా ఫిర్యాదు చేయండి

తహసీల్దార్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది డబ్బులు తీసుకుంటే కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. కార్యాలయాల్లో ఖాళీలున్నాయి. ప్రభుత్వానికి నివేదిక అందించాం. **- పద్మాజారాణి, డీఆర్వో, సంగారెడ్డి.**


అందోలు తహసీల్దారు కార్యాలయం వద్ద..

వర్షమొస్తే చెట్ల కిందికి పరుగులు

జోగిపేట టౌన్: అందోలు తహసీల్దార్ కార్యాలయంలో సౌకర్యాల కొరత వేధిస్తోంది. కార్యాలయానికి వచ్చే రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం ఓ గదిని కేటాయించారు. అందులోనే అన్నీ ఏర్పాటు చేశారు. స్లాట్ బుక్ చేసుకున్నాక వచ్చే వారు ఆరుబయటే నిరీక్షించాల్సి వస్తోంది. వర్షం వస్తే చెట్ల కిందికి పరుగులు పెడుతున్నారు. రోజుకు 8-10 రిజిస్ట్రేషన్లు అవుతున్నట్లు డీటీ మధుకర్‌రెడ్డి తెలిపారు.

వట్‌పల్లి: వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వివిధ పనుల కోసం వచ్చిన వారికి కనీసం శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం లేదు. వ్యవసాయ విపణిలో సేవలు అందిస్తున్నారు. రోజూ 8-10 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

ప్రింటింగ్‌కు జహీరాబాద్ రావాల్సిందే


తహసీల్దార్ కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ విభాగం

జహీరాబాద్ అర్బన్: డివిజన్‌లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నా పాస్‌పుస్తకాల్లో వివరాల నమోదుకు జహీరాబాద్‌కు రావాల్సిందే. న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. రిజిస్ట్రేషన్ విభాగంలోని సిబ్బంది మామూళ్లకు ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

దారంతా పచ్చదనం.. మనసంతా ఉల్లాసం



సంగారెడ్డి పట్టణ పరిధి పోతిరెడ్డిపల్లి నుంచి కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి, కోహీర్, జహీరాబాద్ మండలాల మీదుగా 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారికి ఇరువుపైలా, విభాగిని మధ్యలో పచ్చందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. - న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట.

సదరం శిబిరం.. కిటకిటలాడిన ప్రాంగణం



సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. మంగళవారం సాధారణ రోగులు, మరోవైపు సదరం శిబిరానికి వచ్చే వారితో ఆస్పత్రి కిటకిటలాడింది. ఆస్పత్రిలోని కారిడార్‌లో బారులుదీరారు. ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినా సరిపోకపోవడంతో దివ్యాంగులు, ఇతరులు అవస్థలు పడ్డారు. వివిధ రకాల సమస్యలతో బాధపడే వారు 105 మంది సదరం శిబిరానికి వచ్చినట్లు ఆస్పత్రి పర్యవేక్షకుడు జి.అనిల్‌కుమార్ తెలిపారు. వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు.

క్వారీ పేలుళ్లు... గుండెల్లో రైళ్లు

న్యూస్‌టుడే, జిన్నారం


మాదారంలో పేలుళ్ల ధాటికి ఊడిన అమరవీరుల స్తూపం పలకలు పరిశీలిస్తున్న గ్రామస్థులు

కంకర క్వారీలతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని మాదారంలో పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామానికి సమీపంలోని క్వారీల్లో అధిక సామర్థ్యంతో పేలుళ్లు నిర్వహిస్తున్నారు. మాదారంతోపాటు ఖాజీపల్లి, రాళ్లకత్వ శివారులోని క్వారీలతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు...

మాదారం శివారులోని ఓ క్వారీలో వారం కిందట పట్టపగలు 2 గంటలకు పేలుళ్లు జరపగా.. సమీపంలోని రైతులు పరుగులు తీశారు. ప్రధాన రోడ్డు మార్గంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. మూడ్రోజుల కిందట మాదారానికి చెందిన కురుమ దుర్గయ్య ఇంటి స్లాబ్ పెచ్చులూడింది. ఇళ్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇటీవల గ్రామంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద గ్రానైట్ పలకలు ఊడిపోయాయి. సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని మాజీ సర్పంచి సురేందర్ గౌడ్, యువజన నాయకుడు విజయ్‌గౌడ్ తెలిపారు. గ్రామంలోని చాలా ఇళ్ల గోడలు బీటలువారాయి. ఇంకా గృహప్రవేశం కాని అనేక ఇళ్లకు పగుళ్లు వచ్చాయని గ్రామస్థులు వాపోతున్నారు. కొన్ని వ్యవసాయ బోర్లు కూరుకుపోతున్నాయని, తెల్లటి పౌడర్ గ్రామాన్ని చుట్టుముట్టి కాలుష్య సమస్య సృష్టిస్తోందని పీసీబీకి సైతం ఫిర్యాదు చేశారు.

బాధ్యులకు తాఖీదులిస్తాం..

మాదారం సమస్య మా దృష్టికి వచ్చింది. పేలుళ్లను కట్టడి చేసే అధికారం పోలీసు శాఖకు ఉంది. మా పరిధి క్వారీల వరకే. నిర్వాహకులకు తాఖీదులు ఇస్తాం. కట్టడి చేయకుంటే కఠిన చర్యలు తప్పవు.
- రఘుబాబు, గనుల శాఖ ఏడీ.

రెండు గ్రామాల పరిధిలో 16 వరకు..

మాదారం, ఖాజీపల్లి పరిధిలో 16 వరకు క్వారీలున్నాయి. అక్కడ చట్టబద్ధంగా లైసెన్సులున్న వ్యాపారులే పేలుళ్లు నిర్వహించాలి. దానికి విరుద్ధంగా జరుపుతున్నారు. బండలపై 10 అడుగుల లోతు రంధ్రం తీసి అందులో మందుగుండు నింపి పేల్చాలి. ఇక్కడ 50 అడుగులకుపైగా రంధ్రాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కువ లోతులో రంధ్రాలు చేసి పేలుస్తుండడంతో సమీపంలోని గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయి.

27 మండలాలకు ఎంఈవోల నియామకం

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లాలోని 27 మండలాలకు మండల విద్యాధికారులను(ఎఫ్‌ఏసీ) నియమిస్తూ విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఒక్కో మండల విద్యాధికారి 3, 4 మండలాలకు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. పూర్తి స్థాయిలో ఎంఈవోలు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోయిందని ఫిర్యాదులొచ్చాయి. దీంతో విద్యాశాఖ ఆయా మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయులను మండల విద్యాధికారులు(ఎఫ్‌ఏసీ)గా నియమించింది.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ సూచించారు. మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుతోపాటు సామాజిక అంశాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలను వివరించారు. కష్టపడి చదువుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు: ఎస్పీ


శిక్షణ ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్.. చిత్రంలో అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: విధుల్లో అలసత్వం వహించొద్దని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో జిల్లాకు కేటాయించిన 10 మంది శిక్షణ ఎస్సైలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణకు మారుపేరు పోలీస్‌శాఖ అన్నారు. అంకితభావంతో పనిచేయాలన్నారు. సాయం కోసం వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. ఎదుటి వారి సమస్యలను ఓపిగ్గా విని, వారిలో ధైర్యాన్ని నింపి తక్షణం పరిష్కరించేలా చూడాలన్నారు. వివిధ ఠాణాల్లో విధులు నిర్వహిస్తూ. అన్ని రకాల విధులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఏవో కల్యాణి, సీఐలు రమేశ్, విజయ్ కృష్ణ, రవీందర్‌రెడ్డి, ఆర్ఐలు, శిక్షణ ఎస్సైలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.18.23 లక్షలు

గుమ్మడిదల: బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షకుడు శివరాజ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్‌గుప్తా పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. రూ.18,23,572 ఆదాయం వచ్చినట్లు శివరాజ్ తెలిపారు. అన్నప్రసాదానికి భక్తులు రూ.51,604 విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు సోమయ్య, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం


ఆసుపత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి డాక్టర్ సంగారెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్ వైద్య విధాన పరిషత్తు ప్రాంతీయ ఆసుపత్రిని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో ల్యాబ్‌లు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: చలికాలంలో గురుకులాలు, వసతి గృహ విద్యార్థులు ఇబ్బంది పడకుండా దుప్పట్లకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. గురుకులాల్లో అన్ని వసతులతోపాటు సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

30 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 30 నుంచి నవంబర్ 6 వరకు నమోదు చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్నా.. మరోసారి నమోదు చేసుకోవాలన్నారు. గడువులోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నవంబర్ 23న ముసాయిదా జాబితా విడుదల చేస్తామన్నారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు.

ఆటలు సరే.. ఆలంబనేది?

నిధుల్లేక దాతల వైపు చూపులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. మండల స్థాయిలో నిర్వహణకు రూ.10వేల చొప్పున వచ్చాయి. జిల్లా స్థాయికి రాకపోవడంతో దాతల సాయంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నారు.

నామమాత్రంగానే నిర్వహణ..

నిధులు లేకపోవడంతో పోటీలు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్- 14, 17 పోటీలు జరిగాయి. ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయి. ఈనెల 28వ తేదీ వరకు మూడు పోటీలు నిర్వహిస్తారు. ఆ తరవాత ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారు. వీటితోపాటు 20 రకాల ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలనూ నిర్వహిస్తారు. ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. జిల్లా స్థాయి పోటీలకు రూ.లక్ష, జోనల్ స్థాయి పోటీలకు రూ.50 వేల చొప్పున విడుదల చేస్తామని ప్రకటించినా అమలు కాలేదు. డీసీఈబీ నిధులతో నిర్వహించుకోవాలని ఆదేశాలొచ్చాయి. బిల్లులు సమర్పిస్తే నిధులు విడుదల చేస్తామంటూ ఉన్నతాధికారులు సూచించారు. నిధులు లేకుంటే పోటీలు ఎలా నిర్వహించాలంటూ ఆందోళన వ్యక్తమవుతోంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రతిపాదనలు

రాష్ట్రస్థాయి పోటీల కోసం ఎస్జీఎఫ్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటిలో కరాటే, హాకీ పోటీలు నిర్వహించేందుకు అనుమతొచ్చాయి. వచ్చే నెలలో నిర్వహించే అవకాశముంది. ఉమ్మడి పది జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొననుండడంతో నిధులు కేటాయించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..: వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలకు ఎప్పటి వరకు నిధులు రాలేదు. జిల్లాకు రూ.లక్ష విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్ర స్థాయికి కరాటే, హాకీ పోటీలు నిర్వహిస్తాం. నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులను కోరతాం.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు


వరి పంట పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి తదితరులు

సంగారెడ్డి అర్బన్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ జిల్లా అధికారి కె.శివప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి పట్టణ శివారులో ఆయన వరి పంట పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షపు నీటిని కాల్వల ద్వారా బయటకు పంపాలని సూచించారు. సందేహాలుంటే స్థానిక, మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో రైతునేస్తం పాల్గొన్నారు. ఏడీఏ వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, సాంకేతిక విభాగం ఏవో ప్రతిభ, ఏఈవోలు గాయత్రి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఐటీఐలో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రధానాచార్యులు రాజేశ్వరరావు, శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. http: ///iti. telangana. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

రాజీ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి అర్బన్: రాజీ కేసులను పరిష్కరించేందుకు పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి భవానిచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో మంగళవారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిన్నారంలో 47.0 మి.మీ, ఝరాసంగంలో 43.8, పాశమైలారంలో 38.3, కంకోల్‌లో 32.3, సదాశివపేటలో 29.5, గుమ్మడిదలలో 26.8, హత్నూరలో 26.5, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో 22.8 మి.మీ. మేర వర్షపాతం నమోదైనట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

నాచగిరి హుండీ ఆదాయం రూ.11.83 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 75 రోజులకు రూ.11,83,932 వచ్చినట్లు ఈవో అన్నపూర్ణ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాయంత్రం వరకు లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు, గౌరారం పోలీసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న వీర్‌శెట్టి

టేక్మాల్, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని స్వయం శక్తి అగ్రి ఫౌండేషన్ ఛైర్మన్(మిలెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ) వీర్‌శెట్టి పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచలోని రైతులకు మంగళవారం టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో అవగహన కల్పించారు. పల్వంచ, బొడ్మట్‌పల్లి గ్రామాల్లో కొర్ర సాగుద్వారా సేకరించిన ధాన్యాన్ని తీసుకొచ్చి యంత్రంలో నూర్పిడి చేశారు. పలు ధాన్యాల రకాలతో చేసి ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనంతగిరి.. ఆహ్లాద సిరి!

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ

ఎటూ చూసినా పచ్చదనం, కొండలు.. మూసీ నది పరవళ్లు.. మధ్యలో ఆలయం.. ఇవీ అనంతగిరి విశేషాలు. జిల్లా కేంద్రం వికారాబాద్‌కు 6 కి.మీ. దూరంలోని అనంతగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఇందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపింది. పచ్చజెండా ఊపడమే ఆలస్యం. మరోవైపు కేంద్రం స్వదేశీ అభియాన్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేసింది. తొలి దశలో రూ.38 కోట్లు వచ్చాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.



అనంతగిరి అడవిలో పర్యాటకులు

అభివృద్ధి ఇలా..

- అనంతగిరి కొండల్లో పర్యటకులు బస చేసేందుకు నాలుగు కాటేజీలను ఆధునికీకరిస్తారు.



గ్రాస్‌ల్యాండ్ ప్రాంతం ఇదే..

డైనింగ్ హాల్ నిర్మించనున్నారు.

- ఇక్కడి గ్రాస్‌ల్యాండ్‌లో పర్యటించేందుకు సఫారీ వాహనం సమకూర్చారు. అక్కడే అల్పాహారం, ఆ తర్వాత ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..



– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో, వికారాబాద్

అనంతగిరి కొండలపై పర్యావరణం దెబ్బతినకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్రం అనంతగిరి కొండలను, భువనగిరిని ఎంపిక చేసింది. పర్యాటకానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అనంతగిరికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనూ పలు అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి.

80 హెక్టార్లలో అభివృద్ధి..

ప్రతి శని, ఆదివారాల్లో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పర్యటకులు వస్తుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యటకుల సంఖ్య మరింత పెరగడం ఖాయం. ఈ మేర అటవీ శాఖకు ఆదాయం సైతం పెరగనుంది. వసతుల కల్పనకు నందిఘాట్ సమీపంలో 80 హెక్టార్లను గుర్తించారు. ఇక్కడి ఎబ్బనూరు చెరువు ప్రాంతం వరకు అభివృద్ధికి ప్రతిపాదించారు.

- ఔషధ మొక్కలపై అవగాహన కల్పనకు ప్రత్యేక ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు.
- ట్రీ హౌస్‌లు, టెంట్లలో సందర్శకులు బస చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందుకు రెండు, మూడెకరాలలో వసతులు కల్పిస్తారు.

ప్రత్యేకతలు ఇవీ

- 3800 ఎకరాల్లో అనంతగిరి కొండలు విస్తరించాయి. సముద్ర మట్టానికి 600 అడుగుల ఎత్తులో ఈ ప్రాంతం ఉంది.
- అనంత పద్మనాభ స్వామి కొలువయ్యాడు.
- వెయ్యి ఎకరాలలో 50కి కంటే ఎక్కువ ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నాయి.
- 1946లోనే క్షయ వ్యాధి నివారణ చికిత్సాలయాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం ఇందులోనే ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది.

బహిష్కరణ బాధితులకు అండగా అధికారులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని గౌతోజీగూడెంలో ఓ కుటుంబాన్ని ఈ నెల 10న గ్రామపెద్దలు కుల బహిష్కరించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ పోలీసులు 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 16 మందిని అదుపులోకి తీసుకోగా, 15 మంది పరారీలో ఉన్నారు. ఈ ఘటనపై ఇటీవల బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాధిత కుటుంబంపై వివక్ష చూపకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాధితుడి కూతురు పాఠశాల బస్సులో వెళ్లేప్పుడు ఎవరూ మాట్లాడకపోవడం, ఇంటి వద్ద తోటివారు ఆడుకోకపోవడం వంటి ఘటనలతో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. కిరాణా దుకాణంలో సామగ్రి ఇవ్వడం లేదని తెలపడంతో, అలాంటివి జరగకుండా వ్యాపారులకు ప్రత్యేక సూచనలు చేశారు. బాధితులు చంద్రం, అర్జున్, నర్సమ్మ కుటుంబ సభ్యులకు పోలీసులు అండగా నిలిచారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, పోలీసులు ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.

వర్గల్ నవోదయకు 'పీఎంశ్రీ' హోదా

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎంశ్రీ హోదా దక్కినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం ప్రకారం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నుంచి నిధులు సమకూరుతాయని అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 14 వేల పాఠశాలలు ఎంపిక కాగా అందులో రెండో విడతలో వర్గల్ నవోదయ ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

సింగూరు నీటి రాక.. ఆలయం మూసివేత



సింగూరు ప్రాజెక్టు నుంచి సోమవారం దిగువకు నీటిని విడుదల చేయడంతో మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్ర నామార్చన చేపట్టి మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు కొనసాగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరద ప్రవాహం తగ్గితే బుధవారం ఆలయం తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 11,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది. **– న్యూస్‌టుడే, పాపన్నపేట**

క్రీడల్లో ప్రతిభ చూపితే పారితోషికాలు: మంత్రి



ఎల్లమ్మ చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పురాధ్యక్షురాలు రజిత, ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే పారితోషికాలు అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని ఆయన సందర్శించారు. స్థానిక ఎల్లమ్మ చెరువులో ఇటీవల నిమజ్జనోత్సవం అనంతరం చేరిన వ్యర్థాలను మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించే పనిని చేపట్టారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మినీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి 'స్వచ్ఛతా హీ సేవ' ప్రతిజ్ఞ చేయించారు. వారితో మంత్రి మాట్లాడుతూ.. క్రీడా సౌకర్యాలను విద్యార్థులు, ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

మెదక్ టౌన్: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకొచ్చి.. నీటిని పారించుకొని..



పూడిక తొలగిస్తున్న రైతులు



ఎవరైనా వచ్చి ఏదైనా చేస్తారని ఎదురుచూడలేదు ఆ రైతులు. స్వయంగా తమ సమస్యను పరిష్కరించుకొని సాగునీటికి ఢోకా లేకుండా చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో నల్లవాగు పారుతోంది. వాగుపై జలాశయం నిర్మించారు. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ-4 నుంచి వెళ్లే కాలువ ద్వారా బీబీపేట, ఫతేపూర్ గ్రామాల మీదుగా మార్డి వరకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి వరకు కుడి కాలువ నిర్మించగా.. బీబీపేట వరకు బాగుంది. ఆ తర్వాత పూడిక పేరుకుపోయి, కాలువ అధ్వానంగా మారడంతో వరద పారని పరిస్థితి.

వందెకరాలలో.. మార్డి గ్రామ పరిధిలో బోరుబావుల కింద వందెకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా, బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఇక్కడి రైతులు ముందుకొచ్చి సాగునీటి సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. రూ.1.50 లక్షలు పోగు చేసుకొని 3 కి.మీ. మేర పూడిక తొలగించుకొని కాలువను బాగు చేసుకున్నారు. ఇందుకు రెండు రోజులు శ్రమించారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువ ద్వారా పొలాలకు నీరందుతోంది. ప్రతి ఏటా నీరు విడుదలకు ముందు నీటిపారుదల శాఖ సిబ్బంది కాలువల్లో పూడిక తొలగించేవారు. ఈ సారి చర్యలు తీసుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకురావడం విశేషం.

– న్యూస్‌టుడే, కల్హేర్

చేనేతలో స్వయం ఉపాధికి 'సమర్థ' పథకం



యువతికి పుస్తకాలు, సామగ్రి అందజేస్తున్న చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ పుహాళేంది

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత రంగంలో యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి సామర్థ్యంతో పాటు ఆర్థిక స్వావలంబన పెంపొందించే దిశగా సమర్థ పథకం ఎంతగానో తోడ్పడుతుందని చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుహళేంది అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని చేనేత సహకార సొసైటీ లిమిటెడ్, దుబ్బాక హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లలో యువతకు 45 రోజుల సమర్థ పథకం శిక్షణను ఆయన ప్రారంభించారు. శిక్షణకు ఉపయోగపడే సామగ్రిని అందించారు. ఆయన మాట్లాడుతూ..చేనేత రంగంపై ఆసక్తితో యువత నేటి సాంకేతికతను అందిపుచ్చుకొని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు గాజుల భాస్కర్, బోడ శ్రీనివాస్, అధికారులు పవన్ కుమార్, బాలాజీ, సంతోష్‌కుమార్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు 40 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. మంగళవారం మెదక్‌లోని వెస్లీ పాఠశాల మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి బాలురు-161, బాలికలు-86 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని, ఈ పోటీల్లో సదరు జట్టు పాల్గొంటుందని ఎస్జీఎఫ్ మెదక్‌జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. నిర్వాహకుడు నాగరాజు, పీడీలు రూపేందర్, సుజాత, శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉద్యోగుల గొంతుకనవుతా..



మాట్లాడుతున్న డా.నరేందర్‌రెడ్డి తదితరులు

మెదక్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి గొంతుకై పనిచేస్తానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాకి పోటీ చేయాలనుకుంటున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం రాక.. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగాల ఖాళీల భర్తీకి, డీఏ, ఇంక్రిమెంట్ల సాధనకు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరిష్కారానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, వేతనాన్ని పేదల విద్యాభ్యాసం, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్నేహ విద్యాసంస్థల బాధ్యులు సత్యనారాయణ, బాధ్యులు ఫణిందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నచెల్మెడ అంగన్వాడీ కేంద్రం వద్ద బృందం సభ్యులు

ఐసీడీఎస్ కేంద్ర బృందం పర్యటన

మునిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దచెల్మెడ, చిన్నచెల్మెడ అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. మంగళవారం ఝార్ఖండ్, బిహార్, ఉత్తరాఖండ్, దిల్లీ రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారుల బృందం ఆయా గ్రామాల్లో పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అభ్యసన అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రేణుక, మీనాక్షి ఉన్నారు.

అద్దెకు ఇల్లు కావాలని వచ్చి.. వృద్ధురాలి గొలుసు చోరీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆగంతకుడు గొలుసు లాక్కెళ్లిన ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు, తెలిపిన వివరాలు.. పట్టణంలోని మాజీ సర్పంచి కోరె ఎల్లయ్య తల్లి సత్తవ్వ (70) మంగళవారం ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తు తెలియని యువకుడు వచ్చి ఇల్లు అద్దెకు ఉందా. . అని అడిగాడు. ఆమె లేదని చెప్పడంతో తాగేందుకు మంచినీళ్లు ఇవ్వాలని కోరాడు. ఆమె తెచ్చిచ్చిన నీళ్లు తాగి వెళ్లబోతూ ఒక్క ఉదుటున వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని బయట నుంచి తలుపు గడియ పెట్టి పరారయ్యాడు. ఆమె కేకలకు కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి దుండగుడు పరారయ్యాడు. కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ ఉపేందర్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



తిరుపతి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ పరిధి జాలుబాయితండా సమీపంలో విద్యుదాఘాతంతో గుగులోతు తిరుపతి(25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ధూల్మిట్ట మండలం కొండాపూర్ పరిధి జురాలతండాకు చెందిన తిరుపతి పరిసర గ్రామాల్లో ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం సాయంత్రం నియంత్రిక ఏబీ స్విచ్ ఆపి సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని నియంత్రిక వద్దకు ఎవరు పంపారనేది తెలియాల్సి ఉంది. ఎస్సై విజయభాస్కర్ ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. కేసు నమోదైంది. తిరుపతికి వచ్చే నెలలో నిశ్చితార్థం జరగాల్సి ఉంది.

బోరు వద్ద పొదలు తొలగిస్తుండగా వృద్ధుడు..



అంజయ్య

దుబ్బాక: పొలంలోని బోరు వద్ద ఉన్న పొదలను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురైన వృద్ధుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రఘోత్తంపల్లికి చెందిన గౌరి అంజయ్య (71), ఎల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. సోమవారం రాత్రి పొలం వద్ద మొక్కలు తొలగించేందుకు కొడవలితో కోస్తుండగా ప్రమాదం జరిగింది. కుమారుడు గుర్తించి పరిశీలించగా అంజయ్య అప్పటికే మృతి చెందాడు. కుమారుడు నరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



అలీ రెహమాన్

యాలాల: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితి మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా యాలాల ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. యాలాల పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన అలీ రెహమాన్ (38), పర్వీన్‌బేగం దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అలీ రెహమాన్ సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అదే కాలనీలో విడివిడిగా ఉంటున్నారు. మూడు రోజుల క్రితం రెహమాన్ ఇంటికి తాళం వేసుకొని నిద్రించాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అలీ రెహమాన్ విగతజీవిగా కనిపించాడు. భార్య పర్వీన్ బేగం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చెరువులో పడి వృద్ధుడు..



భూమయ్య

హవేలిఘనపూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన గుండమొల్ల భూమయ్య (70) కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న శ్రీపతి చెరువు వద్దకు వెళ్లాడు. కాలుజారి చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. భూమయ్య ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులో వెతకగా చెరువు వద్ద భూమయ్య చేతి కర్ర, చెప్పులు కనిపించాయి. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభించింది. భూమయ్య కుమారుడు రామానుజన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. జీడిమెట్ల ఎస్సై నాయుడు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకు చెందిన కృష్ణసాయి (23) కొన్ని నెలల క్రితం ఉపాధికి హైదరాబాద్ చింతల్‌కు వలస వెళ్లాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ.. అక్కడి శ్రీనివాసనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మంగళవారం తానుంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆరోగ్య ప్రశస్తి

విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, పరిగి, నర్సాపూర్

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా పాఠశాల్లో చదువుతున్న పిల్లల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అని గుర్తించేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. బాధితులకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రశస్తి యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. ఉపాధ్యాయులే నేరుగా పిల్లలను పరీక్షించి వారిలో ఉన్న లోపాలను అందులో నమోదు చేయనున్నారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో విద్యాశాఖ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర విభాగాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్తి యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయులు.. పేరు, సర్వీసు నంబరు, మెయిల్ ఐడీ, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థుల పేర్లను నమోదు చేయాలి. దీనికి ఈ నెల 23న ప్రారంభమైన శిక్షణ 25 వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఏదైనా ఆరోగ్య సమస్య, అవయవ లోపంతో బాధపడతారు. బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతుంటారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించి సాధారణంగా మార్చమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
సంగారెడ్డి	1,820	2,50,110
సిద్దిపేట	1,845	2,92,200
మెదక్	1,529	2,20,400
వికారాబాద్	1,623	2,39,200



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఎంవో

64 ప్రశ్నలకు..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక కార్యక్రమం అమలుచేస్తారు. దీన్ని రెండు రకాలుగా విభజించారు. యాప్‌లో అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు కొన్నింటిని పిల్లల నుంచి రాబడతారు. మరికొన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి.

పార్ట్-1: ఈ నెల 26 నుంచి అక్టోబరు 26 వరకు కొనసాగుతుంది. యాప్‌లో ఉండే 64 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో అందరినీ పరిశీలించాలి. సరిగా చూస్తున్నాడా, గమనిస్తున్నాడా, చదువుతున్నాడా, అవయవ లోపం, వినికిడి లోపం, నత్తిగా మాట్లాడటం, మనోవైకల్యం, అర్థం చేసుకుంటున్నాడా.. ఇలాంటివి ఉంటాయి. ఏది ఉందో గమనించి నమోదు చేయాలి.

పార్ట్-2: అక్టోబర్ 27 నుంచి నవంబరు 14 వరకు దీన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేస్తారు. వైద్యులు పరిశీలించి చికిత్స అందిస్తారు.

పకడ్బందీగా అమలు

వెంకటేశం, సీఎంవో, సమగ్ర శిక్ష, సంగారెడ్డి

ప్రశస్తి యాప్‌ను పక్బందీగా అమలు చేస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూస్తాం. నెల రోజుల పాటు ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయుడు బోధన చేస్తూ స్క్రీనింగ్ చేస్తారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

గుమ్మడిదల: నల్లవల్లి అటవీ ప్రాంతంలో చెత్త దిబ్బ(డంపింగ్ యార్డు) నిర్మాణం పనులు నిలిపివేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు గుమ్మడిదల మండల అఖిల పక్షల నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నల్లవల్లి పరిధిలోని ప్యారనగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మాణం చేయనున్న డంపింగ్ యార్డును నిర్మాణ పనులు నిలిపివేసేలా చూడాలని వారు కోరారు. మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, భారాస సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మండల భాజపా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామల నాయకులు పాల్గొన్నారు.

'అనుమతులు ఇచ్చింది భారాసనే'

గుమ్మడిదల: భారాస ప్రభుత్వ హయాంలోనే నల్లవల్లి అటవీ ప్రాంతంలో చెత్తదిబ్బ(డంపింగ్ యార్డు)కు అనుమతులు ఇచ్చి.. ఇప్పుడు నిలిపివేయాలని వినతిపత్రాలు ఇవ్వడం తగదని పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం విమర్శించారు.

పోచమ్మబస్తీలో రోడ్డు నిర్మించండి

జిన్నారం: ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలోని పోచమ్మబస్తీలో సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని మంగళవారం కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్ మంగతాయారును కలిసి వినతిపత్రం అందించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వండి

కంది, న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్లేశం పేర్కొన్నారు. కంది సర్కిల్ సమీపంలో సంగారెడ్డి క్లస్టర్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

నిర్మించారు.. వదిలేశారు



బొదతపూర్‌లో వృథాగా భవనం..

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు విశాలమైన వాతావరణంలో బోధనకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తోంది. గదుల కొరత ఉన్న ప్రాంతాల్లో నిధులు మంజూరు చేసి సకాలంలో గుత్తేదార్లు గదుల నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంది. అయినా ఆ పాఠశాల అదనపు తరగతుల భవనాలను వినియోగంలోకి తీసుకురావడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ భవనాలు అసాంఘిక వ్యవహారాలకు నిలయంగా మారుతున్నాయి. తలుపులు, కిటికీలు దొంగల పాలవుతున్నాయి. మరోవైపు పలు ప్రాంతాల్లో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.

ఏళ్లుగా ఇదేతంతు!

జిల్లాలో 1247 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యాభివృద్ధిలో భాగంగా విశాలమైన తరగతి గదుల్లో కూర్చొని విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం పదేళ్ల కిందట అదనపు పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.5.35 లక్షలు చొప్పున కేటాయించింది. గుత్తేదారులు వెనువెంటనే పనులు పూర్తిచేశారు. అ భవనాలు ఇప్పటికీ అధికారులు వినియోగంలోకి తీసుకురావడానికి నిర్లక్ష్యం చేస్తున్నారు.

పాతది శిథిలం.. కొత్తది నిరుపయోగం

ఉమ్మడి మనూరు మండల పరిధిలోని మావినెల్లి, దామరగిద్ద, బొడతపూర్ తదితర గ్రామాల్లో అదనపు గదులు నిర్మించారు. అధికారులు మాత్రం వీటిలో తరగతుల నిర్వహణ కొనసాగించడం లేదు. దీంతో రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. మరోవైపు నేటికీ పాత భవనాల్లోనే పాఠశాలలు కొనసాగుతున్నాయి. శిథిల భవనాలు, ఇరుకు గదుల్లో విద్యాబోధన సాగిస్తున్నారు. వాటివల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం పొంచి ఉందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మించిన అదనపు గదులను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, నారాయణఖేడ్

? సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని వివేకానందనగర్‌లో మట్టి రోడ్డుపై గుంతల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. అధికారులు సమస్య పరిష్కరించాలి. - **విశ్వనాథ్, సంగారెడ్డి.**

✓ తాత్కాలికంగా గుంతల్లో మొరం వేయించి నీరు నిల్వ ఉండకుండా చూస్తాం. - **ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.**

? సంగారెడ్డిలోని ఇందిరా కాలనీలో మురుగు శుభ్రం చేయకపోవడంతో కాలువపైనే మురుగు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలి. – **సతీష్, సంగారెడ్డి.**

✓ వెంటనే సిబ్బందిని పంపి మురుగు శుభ్రం చేయిస్తాం.
– **సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, సంగారెడ్డి.**

? జోగిపేట పట్టణంలోని ఆర్యసమాజ్ మందిరం వద్ద వీధి దీపం వెలగడం లేదు. కుక్కలు, పాముల బెడద ఉండటంతో రాత్రిపూట వెళ్లే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. **-రవి, జోగిపేట.**

✓ వెంటనే ఆ స్తంభానికి దీపం ఏర్పాటు చేయిస్తాం.
-తిరుపతి, కమిషనర్, అందోల్– జోగిపేట.

? అందోలు మండలంలోని డానంపల్లి నుంచి చింతకుంటకు వెళ్లే చెరువు కట్టపై ముళ్లపొదలు పెరిగాయి. వీటివల్ల కట్టపై నుంచి వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. **–నారాయణ, చింతకుంట.**

✓ పొదలు తొలగించి శుభ్రత చర్యలు తీసుకుంటాం.
–మజర్, ఏఈ, అందోలు.

? ఖేడ్ తహసీల్దార్ కార్యాలయ మైదానంలో ట్యాంకును ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారింది. నిత్యం కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు దప్పిక తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. **– నవీన్‌కుమార్, ఖేడ్.**

✓ **ట్యాంకును** పరిశీలించి నీటి సరఫరాకు తగు చర్యలు తీసుకుంటాం.
– జగ్జీవన్, కమిషనర్, ఖేడ్ పురపాలిక.

సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానమే లక్ష్యం



సభ్యత్వ నమోదు పత్రాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనర్సయ్య, గోదావరి తదితరులు

సంగారెడ్డి అర్బన్, సదాశివపేట, కొండాపూర్: పార్టీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా కార్యకర్తలు శ్రమించాలని భాజపా మెదక్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి లక్ష్మీనర్సయ్య, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పాత బస్టాండ్‌లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పి.రాములు, వెంకట్ నర్సింహారెడ్డి, మాణిక్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, కసిని వాసు, నాగరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు. సదాశివపేట, కొండాపూర్‌లోనూ సభ్యత్వాలు నమోదు చేశారు.

అటవీ ప్రాంతాలను రక్షించుకోవాలి: డీఎఫ్‌వో

గుమ్మడిదల, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతాలను రక్షించుకునేలా ఎప్పటికప్పుడు గస్తీ పెంచుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు తెలిపారు. మంగళవారం అన్నారం పరిధిలో పక్షుల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. రేంజ్ అధికారి దేవీలాల్, గుమ్మడిదల సెక్షన్ అధికారి ఏఎల్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సీమంతాలు చేస్తున్న జిల్లా సంక్షేమాధికారిణి లలితకుమారి, ఇతర అధికారులు

పుల్కల్, నారాయణఖేడ్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని జిల్లా సంక్షేమాధికారిణి లలితకుమారి అన్నారు. చౌటకూరు మండల పరిధి కోర్పోల్ రైతు వేదికలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా సమన్వయకర్త సౌమ్య, సీడీపీవో ప్రియాంక, ఎంపీడీవో ఆనంద్‌మేరీ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ● గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని లలితకుమారి పేర్కొన్నారు. ఖేడ్ పురపాలకలో నిర్వహించిన పోషణ మహోత్సవంలో ఆమె మాట్లాడారు. పుర కమిషనర్ జగ్జీవన్, సీడీపీవో సుజాత, అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షకులు, టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

మనూరు, కోహీర్, న్యూస్‌టుడే: నాగల్‌గిద్ద మండలంలోని షాపూర్, మోర్గి, గౌండేగామ్ గ్రామాల్లోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో మహేష్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ● చింతల్‌ఘాట్ ప్రాథమికోన్నత ఉర్దూ, తెలుగు మాధ్యమ పాఠశాలల్లో రూ.3.95 లక్షలతో కొనసాగుతున్న పనులను నీటిపారుదల శాఖ ఏఈ రవీందర్ మంగళవారం పరిశీలించారు.

తవ్వారు... గాలికొదిలేశారు!



సంగారెడ్డి పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి కూడలి నుంచి హైదరాబాద్‌లోని మదీనాగూడ వరకు 'ఎక్స్‌ప్రెస్ హైవే' నిర్మాణ నిమిత్తం గత నెలలో ఆర్భాటంగా తవ్వేసి.. పనులు నిలిపివేయడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. బస్సుల కోసం ప్రయాణికులు నిత్యం వేచి ఉండే కూడలి ప్రమాదకరంగా మారింది. ఈ తవ్వకాల్లోకి వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమరుపాటుగా ఉంటే ఈ గోతుల్లో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

నిలువెత్తుగా అల్లుకున్న నిర్లక్ష్యం



కొంతకాలంగా విద్యుత్తు సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని స్తంభాలకు తీగ జాతి మొక్కలు అల్లుకుంటున్నా.. వారిలో నిర్లక్ష్యం వదలడం లేదు. కింది భాగంలోనూ స్తంభాలు కనిపించే పరిస్థితులు లేవు. జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ దాచారం కాలనీ నుంచి నిత్యం విద్యుత్తు సిబ్బంది వెళ్తున్నా.. ప్రధాన దారి పక్కనే ఉన్న స్తంభానికి తీగ జాతి మొక్కలు ఎగబాకిన తీరు వారికి కనిపించడం లేదు.

– న్యూస్‌టుడే, జిన్నారం.

జాతీయ రహదారిపై తస్మాత్ జాగ్రత్త!



నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే 65వ నంబర్ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. సదాశివపేట మండలం పెద్దాపూర్ శివారులోని వంతెన వద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ దారిపై రాత్రి వేళలో ఏమరుపాటుగా వచ్చేవారు ఇటీవల పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురయ్యారు. ఈ గుంతలను వెంటనే పూడ్చేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట.

'స్వచ్ఛదనం.. పచ్చదనం' అందరి బాధ్యత



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న డీపీవో సాయిబాబా

వట్‌పల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి పాల్గొనాలని డీపీవో సాయిబాబా అన్నారు. మండల పరిధి ఖాదీరాబాద్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అంతకుముందు విద్యార్థులకు పలు క్రీడా పోటీలను ప్రారంభించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని ఒకరి మృతి

సంగారెడ్డి గ్రామీణ: కులబ్‌గూరు గ్రామ శివారులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి(30) స్పృహతప్పి పడిపోగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఆయన చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తిస్తే గ్రామీణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా...

సిర్గాపూర్: సిర్గాపూర్‌కు చెందిన మచ్కురి శేఖర్(32) ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులుగా కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతుకుతున్నారు. మంగళవారం గ్రామ పరిధిలోని సాకి చెరువులో విగత జీవిగా తేలిన శేఖర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించినట్లు సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం

న్యాల్‌కల్: న్యాల్‌కల్ మండలం రాంతీర్థ్‌కు చెందిన నర్సింలు మూడు రోజులుగా ఇంటికి రావడం లేదు. నెలరోజులుగా నర్సింలు మానసిక పరిస్థితి సరిగా లేక తరచుగా ఇంటిని వదిలె వెళ్తూ.. తిరిగి వచ్చేవాడు. మంగళవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పరిసరాలు పచ్చదనంతో వెల్లివిరియాలి

రాయికోడ్: మొక్కలు నాటి సంరక్షించాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీశ్ అన్నారు. మండల పరిధి అల్లాపూర్ శివారులోని ఎస్సీ బాలికల సంక్షేమ గురుకులంలో మంగళవారం 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో షరీఫ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

'పోరాటాలు చేసింది కమ్యూనిస్టులే'

జోగిపేట: నైజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసింది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సాయిలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ రైతాంగ పోరాట వీధి నాటక శౌర్య యాత్ర' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజల విముక్తికి, నైజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసింది ఎర్రజెండానే అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు విద్యాసాగర్, నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగభూషణం, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్ సురేష్, రాములు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్‌తో సామాజిక సేవ



మాట్లాడుతున్న హరికుమార్

జహీరాబాద్, సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి టౌన్: యువత చదువుతోపాటు సామాజిక సేవలో పాల్గొనడం వల్ల చురుకుదనం పెరుగుతుందని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హరికుమార్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ● సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రత్న ప్రసాద్ మొక్కలు నాటారు. ● తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రత్న ప్రసాద్ మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఫార్మాసిటీ' భూముల నిర్వాసితులతో సమావేశం



మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ మేనేజర్ గీత

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్): న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ప్రతిపాదిత ప్రాంతాన్ని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ మేనేజర్ గీత మంగళవారం పరిశీలించారు. డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో సేకరణకు ప్రతిపాదించిన భూములను ఆమె సందర్శించారు. భూములు కోల్పోతున్న రైతులు ఆమెను కలిసి తమ సమస్యలు విన్నవించారు.

జీవన్మృతురాలి అవయవాల దానం

పటాన్‌చెరు అర్బన్: జీవన్మృతురాలి అవయవాలు దానం చేసేందుకు ఆమె కుటుంబం ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంది. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఇందిరమ్మకాలనీకి చెందిన అనిత(33) పాశమైలారం పారిశ్రామికవాడలో కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈనెల 19న ఉదయం విధులకు నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను పటాన్‌చెరులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం సనత్‌నగర్ ఈఎస్ఐలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవయవదానంపై వైద్యులు అవగాహన కల్పించడంతో పుట్టెడు దుఃఖంలోనూ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారు అంగీకరించారు. జీవన్‌దాన్ ట్రస్టు సాయంతో అనిత అవయవాలను సేకరించారు. భార్య, భర్తలు ఇద్దరు కష్టపడి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి అనిత చనిపోవడంతో పదమూడేళ్లలోపున్న ఇద్దరు పిల్లలు బిక్కుబిక్కుమంటున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు పొలాల్లో సస్యరక్షణ కీలకం

జహీరాబాద్, జహీరాబాద్ అర్బన్, జోగిపేట టౌన్: వరద ముంపుతో దెబ్బతిన్న పొలాల్లో సస్యరక్షణ చర్యలు కీలకమని బసంత్‌పూర్- మామిడిగి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.విజయ్ కుమార్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. బూచినెల్లి, బుర్దిపాడు గ్రామాల్లోని నారింజ వాగు పరివాహక పంట పొలాలు మంగళవారం సందర్శించారు. ● పంటలకు చీడపీడలు ఆశించకుండా తగు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ సూచించారు. మంగళవారం చింతకుంటలో ఆయన రైతులతో మాట్లాడారు. ● ఇటీవల వరసగా కురుస్తున్న వర్షాలతో భూమిలో తేమ అధికమై పత్తి పంటకు తెగుళ్లు సోకుతున్నాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త స్నేహలత పేర్కొన్నారు.

'ఆదర్శ' విద్యార్థులకు సన్మానం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఐడీఏ బొల్లారం (జిన్నారం): ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి 'అథ్లెటిక్స్ మీట్'కు ఎంపికైన ఐడీఏ బొల్లారం ఆదర్శ పాఠశాల విద్యార్థులను మంగళవారం సన్మానించినట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి, పీఈటీ శశిరేఖ చెప్పారు. ఈ పోటీల్లో టి.అక్షిత్, హిమాన్షు కుమార్, జి.మధు కుమార్, ప్రణీత్, యశ్వంత్, శేక్ జహర్ఖాన్, ఎండీ కలీమ్‌ఖాన్, గగన్‌నాయక్, భరత్‌రెడ్డి, శ్వేతా యాదవ్, వైష్ణవి, వైష్ణవి, భావన, తేజశ్వినులు ప్రతిభ చాటినట్లు చెప్పారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఏకగ్రీవం

కోహీర్: పీఆర్‌టీయూ కోహీర్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాణయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. మండలాధ్యక్షుడిగా తిరుమలేష్, కార్యదర్శిగా శ్రీధర్‌నాథ్, సభ్యులుగా శ్రీనివాస్, జైపాల్, ప్రశాంతికుమారి, ఉమారాణి, పుష్పమ్మ, వినోదలు ఎన్నికయ్యారు.

ఏఈవోల సమస్యలను పరిష్కరించండి

సంగారెడ్డి అర్బన్: వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)ల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివకుమార్‌కు పలువురు వినతిపత్రం అందించారు. ఏడాదిగా పలుమార్లు సమస్యలు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రవి, ప్రవీణ్‌కుమార్, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్, సంధ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నిషేధం

సంగారెడ్డి అర్బన్: బహిరంగ ప్రదేశాల్లో చుట్ట, బీడీ, సిగరేట్ తాగరాదని ఎన్‌సీడీ సమన్వయకర్త ముంతాజ్ అలీ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో, విద్యాసంస్థల్లో, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అవగాహనలో సదస్సులో ఆయన మాట్లాడారు. యువత పొగాకు బారినపడితే ఉజ్వల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో భీమ్ ఆర్మీ విస్తరిస్తాం'

జహీరాబాద్ అర్బన్: బడుగు, బలహీనవర్గాల సామాజిక అంశాలపై పోరాటానికి తెలంగాణలో 'భీమ్ ఆర్మీ' విస్తరిస్తామని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు వినయ్ రతన్‌సింగ్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బలరామ్ కాంబ్లే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. త్వరలో 'భీమ్ ఆర్మీ' విస్తరణ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు చలపతి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివ, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అఖిల్, జుబేర్, నగేష్, సాబేర్, ఆసీఫ్, ఫరీద్, అహ్మద్ ఉన్నారు.

గైర్హాజరీ అధికారులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

జహీరాబాద్ అర్బన్: విధులకు హాజరుకాకుండా చుట్టపు చూపుగా వచ్చి పోతున్న సహాయ కార్మిక అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. జహీరాబాద్ సహాయ కార్మిక అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం డివిజన్ కార్యదర్శి నర్సిములు ఆధ్వర్యంలో పలువు ధర్నా చేపట్టారు. సహాయ కార్మిక అధికారి లేకపోవడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపించారు.

రేషన్ డీలర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అర్బన్: రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరులో మంగళవారం జరిగిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పల్లె నుంచి పట్నం వరకూ నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని చెప్పారు. సీఎంతో సంప్రదించి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయించేలా చూస్తానన్నారు. ముఖ్యంగా రూ.5 వేల గౌరవవేతనం, క్వింటాకు రూ.300 కమీషన్ లాంటి హామీల అమలుకు కృషిచేస్తానని తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు, ప్రతీ రేషన్ డీలర్‌కు రూ.10 లక్షల బీమా, ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలు, కరోనా సమయంలో మృతిచెందిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని కోరారు. రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి విశ్వంభర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం గోప్యానాయక్‌తండాకు చెందిన సర్దార్‌నాయక్‌కు దవాఖానా ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును మంగళవారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు.

అక్షయపాత్ర గేటు ఎదుట ఆందోళన



కంది: కందిలోని అక్షయ ఫౌండేషన్ వంటశాల ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌లో డెలివరీ బాయ్స్‌గా పనిచేసే ముగ్గురు యువకులు జులై 25న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. వారి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఇవ్వాలని డిమండ్ చేశారు. యువకుల కుటుంబ సభ్యులు, నాయకులు నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వినకపోవడంతో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి నచ్చజెప్పారు. అక్షయపాత్ర యాజమాన్యం, గుత్తేదారు, కొంతమంది ఉద్యోగులతో చర్చించి పరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. పల్లె కిష్టయ్య, నవాజ్ పాల్గొన్నారు.

విషవాయువులతో విలవిల!

జిన్నారం: గడ్డపోతారం, చెట్లపోతారంలో మంగళవారం సాయంత్రం రసాయన పరిశ్రమల నుంచి విడుదలైన విషవాయువుల వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తే కనీస స్పందన లేదని పలువురు ఆరోపించారు.

కంగ్టిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: కంగ్టిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెంకటి కుమార్ మంగళవారం కంగ్టిలో కోరారు. స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు 30 కిలోమీటర్ల దూరంలోని ఖేడ్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. వ్యయ ప్రయాసల వల్ల కొందరు ఇంటర్‌తోనే చదువులు మానేస్తున్నారని వాపోయారు.